సాక్షి నిర్మల్

మంగళవారం । 28 । జనవరి । 2025



‘ఉపాధి’లో పొలంబాట

ఉపాధిహామీ పథకంలో పొలాల బాటలను అభివృద్ధి చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో రైతులు ఇబ్బందులు తీరనున్నాయి. 8లో▸



ట్రిపుల్‌ఐటీలో ప్రొఫెసర్ల నిరసన

బాసర ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 / 18.4

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగలు ఎండగా ఉంటుంది. తెల్లవారుజామున చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు మెడల్స్ తీసుకురావాలి

• ఎస్పీ జానకీషర్మిల



క్రీడాకారులతో ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మెడల్స్ తీసుకురావాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. కరీంనగర్‌లో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించే పోలీస్ స్టేట్‌మీట్ స్పోర్ట్స్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులను సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. స్పోర్ట్స్ మీట్‌కు 16 మంది క్రీడాకారులు వెళ్తున్నారు. వీరు జిల్లాలో నిర్వహించిన క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఉపేంద్రారెడ్డి, రాజేశ్‌మీనా తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా ఉండాలి

నిర్మల్‌టౌన్: సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కరించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

‘స్వర్ణ’ నీరు విడుదల చేయాలి



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నిర్మల్‌చైన్‌గేట్: స్వర్ణ జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయాలని నిర్మల్ రూరల్ మండలం వెంగవాపేట్, తల్వేద, చిట్యాల్ గ్రామాల రైతులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును కోరారు. ఈమేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేస్తే యాసంగి పంటలు వేసుకుంటామని తెలిపారు. స్పందించిన డీసీసీ అధ్యక్షుడు వెంటనే ఇరిగేషన్ ఏఈతో మాట్లాడి సాగునీటిని విడుదల చేయాలని సూచించారు. రైతులు శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సాధ సుదర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుంట వేణుగోపాల్, కుదారపు రాకేశ్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

సారంగాపూర్: పదో తరగతితోపాటు ఇతర తరగతుల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి వారిని ప్రోత్సహించాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని చించోలి(బి) గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం పరిశీలించారు. పదో విద్యార్థులను వివిధ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం సమయంలో ఉపాధ్యాయులు సైతం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల ఎస్‌ఏ-1 పరీక్షల మార్కులను డిస్‌ప్లే చేసి వాటి ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. సీ-గ్రేడ్ విద్యార్థులను గుర్తించి వారిని త్వరలోనే బి-గ్రేడ్‌కు తీసుకురావడానికి కృషిచేయాలన్నారు. అభ్యాస దీపికలు విద్యార్థులు పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. సందేహాలు నివృత్తి చేస్తూ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఫలితాల్లో పాఠశాలను నంబర్ వన్‌గా నిలపాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై సూచనలు చేశారు.

ప్రత్యేక సవాళ్లు



నిర్మల్‌లో కోట్లుపెట్టి నిర్మించిన ఫుట్‌పాత్ దుస్థితి

నిర్మల్: మున్సిపాలిటీలలో పాలకవర్గాల పాలన ముగిసింది. సోమవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మూడు మున్సిపాలిటీలకు కలిపి స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. సోమవారం ఆయన ఆయా మున్సిపాలిటీల్లో బాధ్యతలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న పనులు, అడుగడుగునా సమస్యలు, తీర్చేందుకు నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న బల్దియాలను ఆయన ఒక్కరే ఎలా సమన్వయం చేస్తారు.. సమస్యలను ఎలా పరిష్కరిస్తారనేది సవాల్‌గా మారింది. మరోవైపు సవాలక్ష రాజకీయాలతో ఐదేళ్లు తమ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, స్పెషల్ ఆఫీసర్ అయినా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- మూడింటికీ ఒక్కరే బాస్..
- స్వాగతం పలుకుతున్న సమస్యలు
- మూడు ‘పురాలు’ ఎలా మేనేజ్ చేస్తారో..
- స్పెషల్ ఆఫీసర్‌తో గాడిన పడేనా?

నిర్మల్ మున్సిపాలిటీలో..

పేరుకు జిల్లాకేంద్రమన్నట్లే కానీ.. నిర్మల్ మున్సిపాలిటీలో పల్లెల్లో కన్నా ఎక్కువ సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య నిత్యం చుక్కలు చూపిస్తోంది. ఏ మున్సిపాలిటీలో లేని విధంగా ఇక్కడ ఫుట్‌పాత్‌లు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌నూ మున్సిపాలిటీ మెయింటైన్ చేయకపోయింది. సమీకృత మార్కెట్ కోసమంటూ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని కూల్చి రెండేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ మార్కెట్ నిర్మాణం ప్రారంభించలేదు. ఏళ్లుగా భారీమొత్తంలో పన్నులను చెల్లిస్తున్న ప్రియదర్శినినగర్ వంటి శివారు కాలనీల్లో ఇప్పటికీ సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం గమనార్హం. చెత్తసేకరణ సరిగ్గా లేకపోవడంతో కాలనీల్లోని ఖాళీప్లాట్లు చెత్తకుప్పలుగా మారి దోమలను పెంచుతున్నాయి. కోట్లు ఖర్చు చేసి చేపట్టిన సుందరీకరణ పనులన్నీ కనీసం నిర్వహణ లేక కళావిహీనంగా మారాయి. డివైడర్ల మధ్య చెట్ల పెంపకం, వాటికి ఫెన్సింగ్ కోసం రూ.లక్షలు తీసుకున్న కాంట్రాక్టర్లు నాణ్యత లేని పనులు చేపట్టారు. ప్రధానంగా శివాజీ చౌక్ నుంచి మంచిర్యాల వెళ్లే రోడ్డులో డివైడర్‌కు ఇరువైపులా వేసిన ఫెన్సింగ్ వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ప్రజారోగ్యానికి ముప్పుగా పరిగణిస్తున్న కోనోకార్పస్ చెట్ల తొలగింపును మధ్యలోనే నిలిపివేశారు. చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్‌వరకు రహదారి విస్తరణ మధ్యలోనే వదిలేశారు. పట్టణంలో రోడ్లను శుభ్రం చేసే యంత్రాలు మూలనపడటంతో దుమ్ము పేరుకుపోయింది.

ఖానా‘పురము’లో..



ఖానాపూర్‌లో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

ఐదేళ్లక్రితం కొత్త మున్సిపాలిటీగా ఏర్పడిన ఖానాపూర్ పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. రూ.15 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. రెండు కోట్లతో చేపట్టిన డివైడర్ పనులూ అసంపూర్తిగానే ఉన్నాయి. ఐదేళ్లయినా మున్సిపాలిటీకి సొంత భవనం లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. రూ.3 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మిషన్ భగీరథ కారణంగా పట్టణంలోని రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. ఐదేళ్ల మున్సిపల్ పాలనలో ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడ కూడా సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించిన దాఖలాలు లేవు. వారసంతలో సరైన స్థలం, సౌకర్యాలు లేక వ్యాపారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే రూ.4.80 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమి పూజ చేసినా పనులు ముందుకు సాగడం లేదు. రూ.50 లక్షలకు పైగా వెచ్చించి గోదావరిలో నిర్మిస్తున్న వైకుంఠధామం ఏటా వరదకు కొట్టుకుపోతూనే ఉంది.


భైంసా బల్దియాలో..



ఏపీనగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

భైంసాలో పాత పట్టణంలోని దాదాపు అన్ని కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. మిషన్ భగీరథ పనులతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. 4, 5, 6 వార్డుల్లోని శివారు కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి. డ్రైనేజీలు లేక మురికినీరు రోడ్లపైన, ఇళ్ల ముందు నిలుస్తోంది. దుర్గంధం, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలతోపాటు పట్టణ ప్రజలు సెలవు దినాల్లో కుటుంబ సభ్యులతో సరదాగా బయటకు వెళ్లాలంటే సరైన పార్కు కూడా లేదు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద పార్కు నిర్మించినా అసంపూర్తి పనులతో అందుబాటులోకి రాలేదు. ఏపీ నగర్‌లోని పార్కు సైతం వృథాగా మారింది. ఓపెన్‌జిమ్ పరికరాలు చోరీ అయి నామరూపాల్లేకుండా పోయింది. స్టేడియం ఉన్నా కోచ్‌లు లేకపోవడం, పట్టణానికి దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారింది. రూ.1.40 కోట్లతో నిర్మించిన ఆధునిక వైకుంఠధామం వరదతో దెబ్బతింది. పట్టణంలో రూ.44.60 కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపట్టడంతో తాగునీటికి ఇబ్బందులు తీరాయి. కానీ లీకేజీలతో నీరు వృథాగా పోతోంది.

రైతులకు ‘భరోసా’



3:12 pm
Dear Customer, INR 6,750.00 credited to your A/c No XX3515 on 27/01/2025 through NEFT with UTR RBIO282577447284 by PAY AND ACCOUNTS OFFICE (MAIN BRANCH), INFO: BATCHID:0030-SBI
3:12 pm

లక్ష్మణచాంద మండలం వద్యాల్ తండాలో ఓ రైతు ఖాతాలో నగదు జమైనట్టు వచ్చిన మెస్సేజ్

- ఖాతాల్లో జమ అవుతున్న నగదు
- ఎకరాకు రూ.6 వేల చొప్పున చెల్లింపు
- లబ్ధిదారుల ఫోన్లకు మెస్సేజ్‌లు

జిల్లాలోని మొత్తం రైతులు 2,01,326
రైతు భరోసాకు కావాల్సిన సొమ్ము రూ.283,11,85,496
సోమవారం సాయంత్రం నాటికి బ్యాంక్ డీటెయిల్స్ అప్డేట్ అయినవారు 1,83,954

మండలాల వారీగా సోమవారం రైతు భరోసా జమ అయిన రైతులు..

మండలం	రెవెన్యూవిలేజ్	రైతుల సంఖ్య
బాసర	లబ్ధి	369
భైంసా	ఖడ్గమ్	240
దస్తురాబాద్	దేవునిగూడెం	230
దిలావర్పూర్	సాంగ్వి	258
కడెం	నర్సాపూర్	841
ఖానాపూర్	అడవిసారంగాపూర్	127
కుభీర్	అంతర్ని	305
కుంటాల	విట్టాపూర్	314
లక్ష్మణచాంద	వద్యాల్	1,185
లోకేశ్వరం	బాగాపూర్	573
మామడ	వాస్తాపూర్	108
ముధోల్	వెంకటాపూర్	201
నర్సాపూర్(జి)	నందన్	332
నిర్మల్ రూరల్	తాంశా	632
పెంబి	పస్పుల	327
సారంగాపూర్	పెండల్‌దరి	97
సోన్	సంఘంపేట్	351
తానూర్	సింగన్‌గాం	220

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం రైతుల ఖతాల్లో రైతుభరోసా నిధులు జమ చేస్తోంది. చెప్పిన విధంగానే రిపబ్లిక్ రోజున సీఎం రేవంత్ నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించారు. ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని పేర్కొన్నారు. ప్రారంభం రోజు ఆదివారం కావడంతో రైతు భరోసా డబ్బులు జమకాలేదు. సోమవారం మధ్యాహ్నం నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ మొదలైంది. ప్రభుత్వం ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు అర్హులైన రైతులకు నిధులు అందనున్నాయి. అయితే, గతంలో అమలు చేసిన విధంగానే విడతల వారీగా నిధులు జమ అవుతాయని అధికారులు వెల్లడించారు.

నిధులు విడుదల..

రేవంత్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసింది. ఇప్పటికే బ్యాంకుల్లో నిధుల జమ అయ్యాయి. గత ప్రభుత్వం అమలు చేసిన విధానంలో కొన్ని మార్పులు చేశారు. సాగు చేసే భూములకే భరోసా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది.

తొలిరోజు 18 రెవెన్యూ గ్రామాల రైతులకు..

రైతు భరోసా నిధులు మండలానికి ఒక గ్రామం చొప్పున మొదటి విడత జమ చేసినట్లు తెలిసింది. జిల్లాలో 18 మండలాల పరిధిలోని 18 రెవెన్యూ గ్రామాలకు చెందిన 6,710 మంది రైతుల ఖాతాల్లో తొలిరోజు రైతు భరోసా డబ్బులు జమయ్యాయి.

డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతు వేదికలో డ్రీమ్ సంస్థ రెండేళ్లుగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి నర్సాపూర్(జి), కుంటాల, సోన్, నిర్మల్ మండలాల రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ అరవింద్‌గౌతమ్ కార్యక్రమాలను వివరించారు. విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులకు క్లైమేట్ చాంపియన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ అరవింద్‌గౌతమ్, డ్రీమ్ సంస్థ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఐకేపీ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, ఏఈవో భాగ్యలక్ష్మి, డ్రీమ్ సంస్థ మండల కోఆర్డినేటర్ మురళి, చిన్నయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ‘పుర’ ప్రత్యేక అధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్/ఖానాపూర్: జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా నియమితులైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరుసగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయాలకు వచ్చిన ప్రత్యేక అధికారికి కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఫైజాన్ అహ్మద్ సిబ్బందితో మాట్లాడారు. సమయానికి పనులు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. ఖానాపూర్ మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రగతికి సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు తనకు అందజేయాలని సూచించారు. వారానికి రెండు రోజులు ఖానాపూర్ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనర్హుల తొలగింపు కోసం నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి ఆధ్వర్యంలో సర్వే పూర్తయిందని కలెక్టర్ సంతకం కాగానే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం అడిషనల్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమాల్లో నిర్మల్ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ హరిభువన్, పట్టణ ప్రణాళిక అధికారి హరీశ్, ఆర్వో అనూప్, మెప్మా పీడీ సుభాష్, భైంసా మున్సిపాలిటీ కమిషనర్ రాజేశ్‌కుమార్, ఖనాపూర్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో అభివృద్ధి చేసిచూపిస్తా

- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ.పాల్
- తాజా మాజీ సర్పంచులతో సమావేశం



పార్టీలో చేరినవారితో మాట్లాడుతున్న కేఏ.పాల్

నిర్మల్‌టౌన్: సర్పంచ్‌లుగా ప్రజాశాంతి పార్టీ తరఫున నిలబడి గెలిస్తే ఆ గ్రామాన్ని వంద రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ.పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో తాజా మాజీ సర్పంచులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వారికి రావాల్సిన బిల్లులపై చర్చించారు. పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి చేస్తానన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నిర్మల్ జిల్లాగా ఏర్పడినా గ్రామాలు, మండలాల అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచులు అప్పుల పాలయ్యారని తెలిపారు. బంగారు తెలంగాణ అన్న కేసీఆర్ తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. ఎప్పుడూ రెడ్లు, రావులకే అధికారం ఇద్దామా అని ప్రశ్నించారు. బీసీలకు అధికారం వచ్చేలా ప్రజలు ఓట్లు వేయాలని సూచించారు. కేటీఆర్, రేవంత్ కొట్టుకోవడం.. తిట్టుకోవడం తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. అనంతరం ప్రజాశాంతి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఎమ్మార్సీ తనిఖీ

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని అర్బన్ మండల విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీ)ని డీఈవో రామారావు సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా అంతర్గత పరీక్షల వివరాలు, 10వ తరగతి ప్రత్యేక పరీక్ష పత్రాల ప్యాకింగ్‌ను పరిశీలించారు. ప్రతీ పాఠశాలకు విద్యార్థుల నమోదు అనుసరించి ప్రశ్నపత్రాలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఏ పాఠశాలకు తక్కువ కాకుండా చూడాలన్నారు. ప్రత్యేక పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట జిల్లా పరీక్షల సహాయ కార్యదర్శి భానుమూర్తి, నిర్మల్ అర్బన్ ఎంఈవో నాగేశ్వరరావు ఉన్నారు.

యూడైస్ అంశాల పరిశీలన..

జిల్లా కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో జరుగుతున్న ఎంఐఎస్, సీసీవో, సీఆర్పీలకు యూడైస్ ప్లస్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను డీఈవో పరిశీలించారు. గడువులోగా నమోదు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల పూర్తి సమాచారం, మార్పులు చేర్పులు, అపార్ నమోదు, ఉపాధ్యాయుల వివరాలు తదితర అంశాలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఈ పనులను ఎంఈవోలు పర్యవేక్షించాలని తెలిపారు. ఆయన వెంట ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజేశ్వర్, అధికారులు లింబాద్రి, సలోమి కరుణ, నాగేశ్వరరావు ఉన్నారు.

సమస్యలపై సత్వరం స్పందించాలి

- అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు
- ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల సమస్యలపై అధికారులు సత్వరం స్పందించాలని, ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, తదితర సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. కలెక్టర్ కూడా సమస్యను ఓపికగా విని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపర్చాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలి..

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక అధికారులంతా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష ఫలితాల వివరాలు అందజేయాలని తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతీ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది శనివారం శ్రమదానం నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా భూమిని విడిపించాలి..



నాకు ముజ్గి గ్రామంలో 205ఆ, 205ఆ/1 లో 2.37 గుంటల భూమి ఉంది. ఇందులో నుండి కోల్మొండ శారద 1.05 గుంటల భూమిని కబ్జా చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సర్వేయర్‌తో సర్వే చేయించి పంచనామా తీసుకున్నా మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. అధికారులు స్పందించి మా భూమిని మాకు ఇప్పించండి. – భూమన్న, ముజ్గి

ఆసుపత్రిలో పోస్టులు భర్తీ చేయాలి..



జిల్లా జనరల్ ఆసుపత్రిలో పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించక పోవడంతో ప్రస్తుతం ఉన్నటువంటి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. నిర్మల్ జిల్లా ఏర్పడిన తర్వాత ఆసుపత్రిలో ఓపీ సంఖ్య పెరిగింది. దానికి అనుగుణంగా ఇప్పటివరకు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ సిబ్బందిని నియమించలేదు.

– సిర్ర దేవేందర్, ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

రుణమాఫీ కాలేదు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో రెండు లక్షలలోపు ఉన్న ప్రతి రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చింది. నేను కేవలం రూ.లక్ష రుణం తీసుకున్నాను. ప్రభుత్వం నాలుగుసార్లు రుణమాఫీ చేసిన నాకు రుణమాఫీ కాలేదు. అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదు. రుణమాఫీ అయ్యేలా చూడాలి.

– కామింద్ల చిన్న తక్కన్న, గంజాల్

తప్పుడు పత్రాలతో భూకబ్జా..



నాకు పీచర గ్రామంలో 286/ఈ సర్వే నంబర్ రైతు వేదిక పక్కన వ్యవసాయ భూమి ఉంది. గోపతి భూమన్న ఈ భూమిని కబ్జా చేశాడు. ఓ నకిలీ పత్రాన్ని కొద్ది మంది సాక్షులు, మాతండ్రి వేలి ముద్రతో తప్పుడు పత్రాలు సృష్టించి చూపించాడు. మా తండ్రి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆయన చదువుకున్న వ్యక్తి. వేలిముద్ర వేయరు సంతకమే చేస్తారు. అధికారులు నా సమస్య పరిష్కరించాలి.

– వద్నాల కృష్ణ, పీచర

నియామకాలు చేపట్టాలి..



గత మార్చిలో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నేటికీ ఆ పోస్టులను భర్తీ చేయలేదు. ఇదే విషయం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదిస్తే అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. ఎప్పుడు అడిగినా సంబంధిత ఫైల్‌పై అధికారులకు నివేదించామని త్వరలోనే భర్తీ చేస్తామనే సమాధానమే చెప్తున్నారు.

– వంశీ, నిర్మల్

క్లుప్తంగా

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధి దండేపల్లి మండలం లింగాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుచ్చన్న ఇంట్లో సోమవారం తనిఖీ చేయగా కలపను లభించింది. స్వాధీనం చేసుకున్న కలపను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరు మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

సోన్: మండల కేంద్రంలోని ఐబీ వద్ద కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా మంజులాపూర్ గ్రామానికి చెందిన అంగాల పోతగౌడ్(63) సోమవారం గోదావరినది మాదాపూర్ ఘాట్‌కు స్నానం చేసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఆర్మూర్ నుంచి నిర్మల్‌కు వస్తున్న కారు డ్రైవర్ మల్లికార్జున్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన పోతగౌడ్‌ను అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని ఏఎస్సై షేక్ అహ్మద్ తెలిపారు. సీఐ నవీన్‌కుమార్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్ వద్ద ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. సోమవారం భైంసా నుంచి ఆర్టీసీ బస్సు నిర్మల్ వెళ్తోంది. భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు కొంతమేర దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ లింగన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి రిమాండ్

బెజ్జూర్: రోడ్డు ప్రమాద కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల నరేశ్ రోడ్డు ప్రమాద కేసులో కోర్టుకు హాజరుకానందున నాన్‌బెయిల్ వారెంట్ జారీ అయింది. సోమవారం నరేశ్‌ను అదుపులో తీసుకుని సిర్పూర్ కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజులపాటు రిమాండ్ విధించారని ఎస్సై పేర్కొన్నారు.

‘ఉపాధి’లో పొలంబాట

- ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు
- రైతుల పనులకు ప్రాధాన్యం
- మార్చినెలాఖరులోగా పూర్తికి కసరత్తు



కోటపల్లి మండలం బొప్పారంలోని పొలాలకు వెళ్లే బురద దారి

కోటపల్లి: జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లోని బాటలను అభివృద్ధి చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో ఏళ్లుగా పొలాల్లో రాకపోకలకు రైతులు ఎదుర్కొటున్న ఇబ్బందులు తీరనున్నాయి. గతంలో నక్ష బాటలు, పూర్వకాలం నుంచి బండ్ల బాటలు ఉన్న ప్రాంతాల్లో రహదారులను బాగు చేయగా..తాజాగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మార్చి నెలాఖరులోగా ఈ పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. వీటిలో జలసంరక్షణ పనులతోపాటు రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలినడక బాటలను బాగు చేసేందుకు చర్యలు చేపట్టారు.

నిధులు కేటాయింపు

రైతుల పొలాల మధ్య ఉన్న కాలిబాటలను దారులుగా మార్చేందుకు ఉపాధిహామీ పథకంలో కొంత మేర నిధులు కేటాయించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఆ నిధులతో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో రైతుల అంగీకారం మేరకు పనులు చేపట్టనున్నారు.

రైతులకు ఉపయోగపడేలా..

రైతులకు ఉపయోగపడేలా పశువుల షెడ్లు, అజోల్లా పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ పనులు జలనిధి ద్వారా చెక్‌డ్యాం నిర్మాణం, ఇంకుడుగుంతలు, వ్యవసాయబావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు చేపట్టనున్నారు. పొలాల బాటల అభివృద్ధి కోసం ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు వెచ్చించనున్నారు. తమ ఆవాసాల నుంచి పొలాలకు చేరేందుకు రైతులు సరైన రోడ్లు లేక ఒడ్డు, గట్ల మధ్య నడిచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, బోరు మోటార్లు, పైపులు తదితర సామగ్రిని మోసుకెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వారి కష్టాలు వర్ణణాతీతం. ప్రభుత్వం పొలాలకు బాటాలు బాగు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	మండలం	పంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ నిర్ణయంతో పొలాలకు కాలిబాటల్లో వెళ్లే రైతుల ఇబ్బందులు తీరుతాయి. పొలాల మధ్య నుంచి తమ బావుల వద్దకు వెళ్లే రైతుల అంగీకారంతో పనులు చేపడుతాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల జిల్లా

రావిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



జంగుబాయికి మొక్కు

- తరలివచ్చిన భక్తులు
- నేడు కేస్లాపూర్‌కు అమ్మవారు
- ముగియనున్న ఉత్సవాలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని మహరాజ్‌గూడ సమీపంలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు ముగియనున్నాయి. బుధవారం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాగోబా పూజ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి జంగుబాయి అమ్మవారు కేస్లాపూర్‌కు చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ముగింపు సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి జంగుబాయిని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కు చెల్లించుకున్నారు. సుమారు 316 మేళంలు అమ్మవారిని దర్శించుకున్నాయి. ఇప్పటివరకు 2.10 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ కమిటీసభ్యులు శ్యాంరావు, మరప బాజీరావు తెలిపారు.

నేడు దేవతల విగ్రహాల శుద్ధీకరణ

మంగళవారం సాయంత్రం కపిలయి, సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లో గల పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసువచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. తర్వాత నాగోబా పూజకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధీతో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.



మైసమ్మకు పూజలు చేస్తున్నభక్తులు



భేటింగ్ అవుతున్న మహిళలు

‘కాంగ్రెస్ పాలన మాకొద్దు’



నిరసన తెలుపుతున్న ముఖరా(కే) గ్రామస్తులు

ఇచ్చోడ: కాంగ్రెస్ పాలన మాకొద్దంటూ మండలంలోని ముఖరా(కే) గ్రామంలో సోమవారం గ్రామస్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ గణతంత్ర వేడుకల సందర్భంగా అర్హులందరికీ రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి మిగతావారికి మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 13 నెలల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు తిరుపతి, విఠల్, దత్తు, అశోక్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. వివరాల ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గోల్కొండ పోచమల్లు సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగి రేకుల ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఆర్ఐ భానుచందర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో స్టడీ సర్టిఫికెట్లు, రూ.లక్ష నగదు, 2 తులాల బంగారంతోపాటు ఇంటి సామిగ్రి, 4 క్వింటాళ్ల బియ్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు.

రాంనగర్‌లోని ఇంట్లో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని రాంనగర్‌కాలనీలో సాయికిరణ్ ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. మావల వైపు నుంచి ఆదిలాబాద్ వస్తున్న ఎస్పీ గౌస్ ఆలం గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. మంటలార్పే వరకు అక్కడే ఉన్నారు. ఇంట్లో కూలర్ వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందని ఫైర్ అధికారులు గుర్తించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని కాలనీవాసులు తెలిపారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, మావల ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.

కిరాణాషాపులో అగ్నిప్రమాదం

చింతలమానెపల్లి: మండలంలోని కోయపెల్లి గ్రామంలో కిరాణాషాపు సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో తినుబండారాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సామగ్రి కాలిపోయాయి. స్థానికులు నీటి చల్లడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు తనను ఆదుకోవాలని బాధితుడు కుమురం కనకయ్య కోరాడు.

ప్రమాదవశాత్తు స్కూటీ..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలో స్కూటీ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన అంకన్న సోమవారం సాయంత్రం స్కూటీపై బూర్గుడ గ్రామానికి వెళ్తున్నాడు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద స్కూటీ నుంచి శబ్దం రావడంతో ఆపి చూసేసరికి బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. దివ్యాంగుడైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని అంకన్న వేడుకున్నాడు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేటలోని ఆది శంకరాచార్య జిన్నింగ్ మిల్లులో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. మిల్లు ఆవరణలో నిల్వ ఉంచిన పత్తి కుప్పలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది వెంటనే చెన్నూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మరో ఫైరింజన్ తెప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా, మంటలు ఎలా అంటుకున్నాయో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, కాలిన పత్తి, నష్టం వివరాలను అంచనా వేసి వెల్లడిస్తామన్నారు.

పెరటిలో గంజాయి పెంపకం



పెరటిలో పెంచిన గంజాయి మొక్క

వేమనపల్లి: రైతు తన పెరటిలో రెండు గంజాయి మొక్కలు పెంచి పోలీసులకు దొరికిపోయాడు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ కథనం ప్రకారం.. వేమనపల్లికి చెందిన రైతు తెల్గ నారాయణ తన ఇంటి వెనుకాల ఉన్న పెరటిలో రెండు గంజాయి మొక్కలు నాటాడు. నిత్యం గంజాయి సేవిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై సోమవారం ఆయన ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. నారాయణ వద్ద ఉన్న 584 గ్రాముల ఎండు గంజాయితోపాటు ఒక చెట్టును స్వాధీనం చేసుకున్నారు. పక్వానికి వచ్చిన చెట్టును పీకి వేసి లుంగీలో మూటగట్టి గడ్డివాములో దాచి ఉంచినట్లు తెలిపారు. గంజాయి మొక్కగా ఏవో వీరన్న గుర్తించారు. దీని విలువ రూ.10 వేలు, ఎండు గంజాయి రూ.14,600 ఉంటుందని ఎస్సై తెలిపారు. నారాయణను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

356 కిలోల గంజాయి ధ్వంసం



పట్టుకున్న గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది

ఇచ్చోడ: వివిధ కేసుల్లో పట్టుకున్న 356 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల మెడికేర్ సర్వీస్ సెంటర్‌కు గంజాయిని తరలించి అక్కడి ఎలక్ట్రికల్ యంత్రంతో సోమవారం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాకీతో బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: తుపాకీతో చంపుతానని బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష సోమవారం తీర్పునిచ్చింది. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ మహార్ పానీపూరి బండి నిర్వహిస్తున్నాడు. అతని వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాప్రసాద్ అలియాస్ రాజు కొంతకాలం పనిచేసి మానేశాడు. 2016 నవంబర్ 12న ఇద్దరి మధ్య లావాదేవీల విషయంలో గొడవపడ్డారు. రాజు తుపాకీతో చంపుతానని బెదిరించడంతో వినోద్‌మహార్ అదేనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ డి.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టి రాజును రిమాండ్‌కు తరలించి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. నిందితుడు రాజుకు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చింది.

చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇద్దరికి బెయిల్

చెన్నూర్‌రూరల్: చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇద్దరికి సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. ఎఫ్ఆర్వో శివకుమార్ కథనం ప్రకారం..మండలంలోని శివలింగాపూర్‌కు చెందిన బోయప్రసాద్, నక్క మహేందర్, ఊరటి పోచంలు గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి చుక్కల దుప్పిని హతమార్చారు. ఈనెల 24న రాత్రి సమయంలో నక్క మహేందర్ ఇంట్లో దుప్పిని కోసి పోగులు వేస్తుండగా అటవీ అధికారులు దాడి చేసి ప్రసాద్, మహేందర్‌లను పట్టుకున్నారు. పోచం పరారీలో ఉన్నాడు. పట్టుకున్న ఇద్దరిని సోమవారం మంచిర్యాల కోర్టులో హాజరుపర్చగా సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. డిప్యూటి రేంజ్ అధికారి ప్రభాకర్, బీట్ అధికారి స్వప్న, సెక్షన్ అధికారులు రాజేష్, చంద్రమోహన్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



గంధం సంతోష్

నిర్మల్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గాంధీనగర్ కాలనీకి చెందిన గంధం సంతోష్ ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సెల్ 87126 59511, 87126 59512 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

ఖండేవుని ఆలయంలో ఎంపీ పూజలు



బేలలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్



నార్నూర్: పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

నార్నూర్: మండల కేంద్రంలోని తొడసం వంశీయుల ఆరాధ్యదైవం ఖండేవుని ఆలయంలో ఎంపీ గోడం నగేశ్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖండేవ్ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మహాపూజ కోసం తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి రాథోడ్, ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, బీజేపీ బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్, నాయకుడు మాడవి చంద్రహరి తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

బేల: సదల్‌పూర్ మహాదేవ్, బైరందేవ్ ఆలయాల అభివృద్ధి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. సోమవారం జంగీ జాతర పురస్కరించుకొని మండలంలోని సదల్‌పూర్ మహాదేవ్, బైరందేవ్ ఆలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆదివాసీ దర్బార్ సభలో ఆయన మాట్లాడుతూ పుష్యమాసం ఆదివాసీలకు చాలా పవిత్రమని, నెలరోజులు భక్తిశ్రద్ధలతో కుల దైవాలను పూజిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమన్వయంతో ఆలయాల అభివృద్ధికి చొరవ తీసుకుంటామన్నారు. కాగా ఆలయాలకు ప్రహరీ, ఒక బోరు సౌకర్యం, సదల్‌పూర్ నుంచి ఆలయాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతోపాటు ఆలయాల ఆధునికీకరణ కోసం ఆలయ కమిటీ సభ్యులు ఎంపీకి వినతిపత్రం అందించారు. బీజేపీ నాయకులు పాయల్ శరత్, దత్తా నిక్కమ్, ఇంద్రశేఖర్, రాందాస్, దేవ్‌రావు, మోరేశ్వర్, గణేశ్, ఆలయ కమిటీ సభ్యులు శ్యాంరావు, కుషాల్‌రావు, సోనేరావు ఉన్నారు.

మళ్లీ చదువుకునే అవకాశం

- మధ్యలో మానేసిన వారికి, ఓపెన్ స్కూల్ ద్వారా
- నేడు, రేపు తత్కాల్ ప్రవేశాలు



దండేపల్లిలో ఓపెన్ తరగతుల బోధన

దండేపల్లి: వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారు మళ్లీ చదువుకునేందుకు తెలంగాణ సార్వత్రిక పీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) అవకాశాన్ని కల్పిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ఇదివరకే పూర్తయినప్పటికీ, ఈనెల 27 నుంచి 29 వరకు తత్కాల్ విధానంలో ప్రవేశాలకు మరో అవకాశం కల్పించింది. టెన్త్, ఇంటర్ చదువుకోవాలనేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సెలవురోజుల్లో తరగతులు..

పదో తరగతికి 14, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి 15 ఏళ్లు నిండి ఉండాలి. బడి మధ్యలో మానేసినవారు పది, పదో తరగతి పూర్తయిన వారు ఇంటర్ చదవొచ్చు. సరళమైన విద్యావిధానం, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. మహిళలు, పలు వృత్తి, వ్యాపారాల్లో ఉన్నవారు, ప్రజాప్రతినిధులు, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వారికి సదావకాశం. స్వీయ అభ్యసన సామగ్రి అందజేస్తారు. యూట్యూబ్ ఛానల్, వెబ్‌సైట్ ద్వారా పాఠ్యాంశాలు నేర్చుకోవచ్చు. ఒకసారి ప్రవేశం పొందినప్పటి నుంచి 5 ఏళ్లు లేదా 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలు రాయొచ్చు. ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల ద్వారా ఈనెల 29 లోగా దరఖాస్తు ఫీజు చెల్లించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ఓపెన్ అధ్యయన కేంద్రాలు..

జిల్లా	కేంద్రాలు	(టెన్త్, ఇంటర్)లో ఇప్పటివరకు ప్రవేశాలు
ఆదిలాబాద్	11	890
కుమురంభీం	10	485
మంచిర్యాల	13	1370
నిర్మల్	14	1077

దరఖాస్తు చేసుకోవాలి

వివిధ కారణాలతో చదువు మానేసి, మళ్లీ చదువుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. తత్కాల్ ప్రవేశాలకు రెండు రోజులు అవకాశం ఉన్నందున ఆసక్తి ఉన్నవారు ఎవరైనే ఉంటే దరఖాస్తు చేసుకోవాలి.
– అశోక్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్

ట్రిపుల్‌ఐటీలో ప్రొఫెసర్ల నిరసన



బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నామని తెలిపారు. 77 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ట్రిపుల్‌ఐటీ భాగస్వాములమైన తమకు యూజీసీ పేస్కేల్‌తో కూడిన గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతోపాటు మూడు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.